సంక్షేమానికి ‘సురక్ష’

- అర్హులందరికీ గ్రామంలోనే ధ్రువపత్రాల జారీ
- సత్ఫలితాలిస్తున్న జగనన్న సురక్ష పథకం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



రామదుర్గంలో ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు



ఆలూరు సచివాలయం-2లో కుల ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఉచ్చీరమ్మ

చిప్పగిరి: అర్హత కలిగిన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజల సత్ఫలితాలు అందుతున్నాయి. గతంలో కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్‌లో మార్పులు, మొబైల్ నంబర్ లింక్ తదితర సేవలు పొందాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. ఆయా ధ్రువపత్రాలు, సేవలను బట్టి మీ సేవ కేంద్రాల్లో రూ.50 నుంచి 500 వరకు చెల్లించి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో అర్హత ఉండి వివిధ కారణాలచేత సంక్షేమ పథకాలు పొందని నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన 9 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వాలంటీర్లు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి వారికి ఏ ధ్రువపత్రాలు అవసరమో వివరాలు నమోదు చేస్తున్నారు. జూలై 1 నుంచి అధికారులు బృదాలుగా ఏర్పడి ప్రతి గ్రామాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువ పత్రాలు మంజూరుచేస్తున్నారు. ఈ కార్యక్రమంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

మ్యారేజ్ సర్టిఫికెట్ అందుకున్నా



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నాకు మ్యారేజ్ సర్టిఫికెట్ ఉచితంగా అందించారు. నాకు మూడు నెలల క్రితం వివాహం అయ్యింది. పెళ్లయిన తర్వాత సర్టిఫికెట్ ఎలా తెచ్చుకోవాలా అని తర్జనభర్జన పడ్డాను. ఇటీవలే వలంటీర్ మా ఇంటికి వచ్చి అప్లికేషన్‌తో పాటు వివరాలు తీసుకున్నాడు. శనివారం మా గ్రామ సచివాలయం వద్ద ఉచితంగా సర్టిఫికెట్ ఇచ్చారు. చాలా అనందంగా ఉంది. జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా ధ్రువపత్రాలు ఇస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– పూజారి తిమ్మప్ప, గూళ్యం గ్రామం, హాలహర్వి మండలం

తప్పిన వ్యయప్రయాసలు



గతంలో కులధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్ కోసం మీసేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకునేవాళ్లం.తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి వీఆర్వో, ఆర్‌ఐల సంతకాల కోసం వేచిఉండాల్సిన పరిస్థితి ఉండేది. కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం 15 నుంచి 30 రోజుల దాకా పట్టేది. దీనికి తోడు రూ.100 వరకు ఖర్చు అయ్యేది. గత మూడు రోజుల క్రితం వలంటీర్ వచ్చి మాకు ఏ ధ్రువపత్రాలు కావాలో నమోదు చేసుకుని వెళ్లాడు. శనివారం పైసా ఖర్చులేకుండా కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందించారు. వ్యయప్రయాసలు తప్పాయి.

– ఉచ్చీరమ్మ, ఆలూరు

చాలా సంతోషంగా ఉంది



ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువ పత్రాలు ఉచితంగా ఇవ్వడం సంతోషదాయకం. గతంలో నెలల కొద్ది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ధ్రువపత్రాలు వచ్చేవి కావు. ఇప్పుడు అధికారులే ఇళ్ల దగ్గరకు వచ్చి ఉచితంగా అందించడం దేశంలో ఎక్కడా జరిగిన దాఖలాలు లేవు. నేను జగనన్న సురక్ష ద్వారా దరకాస్తు చేసుకున్న వెంటనే కౌలు రైతు కార్డు వచ్చింది. పేదల సంక్షేమం కోసం ఇంతలా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

– బోయ తిరుపాల్, కౌలు రైతు, రామదుర్గం

ఆనందంగా ఉంది



గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. సచివాలయాల ఏర్పాటుతో సమస్య పరిష్కారం అయ్యింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులు మా ఇంటికి వచ్చి ఏమైనా సర్టిఫికెట్లు అవసరమా అని అడిగారు. నేను కులధ్రువీకరణ పత్రం కావాలని చెప్పాను. వారు దరఖాస్తు చేసుకొని జగనన్న సురక్ష కార్యక్రమంలో పైసా ఖర్చులేకుండా ధ్రువీకరణ పత్రం అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో బాగుంది.

– మత్స్యవల్లభుడు, పుట్టపాశం గ్రామం

జగనన్నకు కృతజ్ఞతలు



ఈమె పేరు చాకలి గోవిందమ్మ. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరిగినా మంజూరు కాలేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్థానిక గ్రామ సచివాలయం -2లో దరఖాస్తు చేసుకోగానే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. గంటల వ్యవధిలోనే ధ్రువపత్రాలు అందజేయడంపై ఇలాంటి కార్యక్రమం ప్రవేశపెట్టిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలిపింది.

– చాకలి గోవిందమ్మ, ఆలూరు

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



పీఠాధిపతికి తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

హాలహర్వి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనలో మెలగాలని, భక్తిభావం కలిగి ఉండాలని పీఠాధిపతులు శ్రీ సద్గురు శివానందభారతి స్వాములు, శ్రీ సద్గురు విద్యానందభారతి స్వాముల వారు సూచించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని చాకిబండ గ్రామంలోని శివాలయంలో మాజీ సర్పంచ్ కె.లింగన్న ఆధ్వర్యంలో పీఠాధిపతులకు గ్రామపెద్దలు, గ్రామస్తులు తులాభారం నిర్వహించారు. పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ.. దేవుడి పట్ల భక్తి కలిగి ఉండాలని, మనస్సులో దేవుడిని స్మరించి కార్యాన్ని చేపడితే విజయం వరిస్తుందని చెప్పారు. నేటి సమాజంలో ఎన్నో ఒడిదుడుకులతో ప్రజలు జీవనం సాగిస్తున్నారని, ఆధ్యాత్మిక చింతన చేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రజలు సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆడిట్‌కు సిద్ధం కండి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకంకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం వారు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ నుంచి జరిగిన పనులకు సంబంధించి త్వరలో ఆడిట్ జరుగుతుందని అందరూ రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నందవరం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ తిమ్మయ్య హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మండలకేంద్రంలోని నాగలదిన్నె రోడ్డులోని వంక వద్ద నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించి అరెస్టు చేశారు. నిందితులు కే.పేట గ్రామానికి చెందిన మహలింగప్ప, వీరేష్‌గౌడ్, హేమంత్‌గౌడ్‌తో పాటు నందవరం గ్రామానికి చెందిన మల్లికార్జునగౌడ్‌ను అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేడు బొల్లవానిపల్లిలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

తుగ్గలి: మండల పరిధిలోని బొల్లవానిపల్లిలో సోమవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, సచివాలయ కన్వీనర్లు జిట్టా నాగేష్ యాదవ్, హనుమంతు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రేపు బురుజులలో ‘జగనన్న సురక్ష’

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసపింహమూర్తి ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో 11 రకాలు ధ్రువపత్రాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొక్కరచేడులో అగ్ని ప్రమాదం



మంటల్లో దగ్ధమైన గుడిసె

హాలహర్వి: మండలంలోని కొక్కరచేడు గ్రామంలో ఆదివారం చింతకుంట తిమ్మప్ప భార్య శాంతమ్మకు చెందిన గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు శాంతమ్మ వాపోయింది. దినసరి కూలీ అయిన శాంతమ్మ ఆదివారం కూలి పనికి వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గుడిసె కాలిపోయింది. స్థానికులు బక్కెట్లు, బిందెలతో నీటిని తీసుకొచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆర్థికంగా నష్టపోయిన బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ మన్మథ రెడ్డి, గ్రామస్తులు కోరుతున్నారు.

కరిడిగుడ్డంలో సప్త భజనలు

ఆలూరు: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో మహాయోగి, అవధూత మంగమ్మవ్వ దేవాలయంలో సప్త భజనలను ప్రారంభించినట్లు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, నిర్వాహకులు ఆదివారం తెలిపారు. గ్రామానికి సమీపంలోని భక్త భజన బృందం వారికి అవకాశం కల్పించినట్లు వారు తెలిపారు. ప్రజలందరికీ అవ్వ కటాక్షం కలగాలని కాంక్షిస్తూ భజనలను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి



ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎర్రకోట జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జొహరాపురం టీడీపీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు అభ్యున్నతి సాధించాయని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. నందవరం మండల పరిధిలోని జొహరాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎర్ర నరసింహులు, కె.నాగేంద్ర, హనుమన్న, రమేష్,యంకప్ప, బుడ్డప్ప, బుడ్డ నరసన్న, శంకరప్పతో పాటు మరో 80 మంది ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యేతో పాటు సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, టీడీపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల తరువాత టీడీపీ పూర్తిగా కనుమరుగు కావడం ఖాయమన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీలో చేరినవారు పార్టీ బలోపేతానికి ఐక్యతతో పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆశీర్వాదం

ఎమ్మిగనూరు: ప్రకృతి సహకారం.. పాలకుల సుపరిపాలన నడుమ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు ఆనంద తీర్థ స్వామిజీ ఆకాంక్షించారు. ఆదివారం ఎమ్మిగనూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు కంకణం తొడిగి టీటీడీ తరపున వస్త్రాలు, ఫలప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కలుగొట్లలో బీజామృతం తయారీ పద్ధతిని వివరిస్తున్న అధికారులు

వెల్దుర్తి: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో సబ్ డివిజన్ అధికారి మాబువలి ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గ్రామ సెంటర్‌లో రైతులను పోగుచేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో మొక్క ఎదుగుదల, వేరు పురుగులను అరికట్టేందుకు విత్తనాలు, నారును శుద్ధి చేసుకునేందుకు వినియోగించే బీజామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. బీజామృతంతో శుద్ధి అనంతరం విత్తనం నాటుకోవాల్సిన పద్ధతులను తెలిపారు. రసాయన ఎరువులతో పోల్చితే సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర్లు, పరమేశ్వరుడు, ఐసీఆర్‌పీలు పార్వతమ్మ, రామచంద్రుడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎమ్మిగనూరురూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఆర్.మురహరరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారం చేపట్టి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గత వారం ఎమ్మిగనూరులో నిర్వహించిన బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తున్న నిధులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియచేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కో–కన్వీనర్ కపిలేశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బీఎల్.నారాయణ, భారతమ్మ, నాయకులు కిరణ్, రాముడు, దేశాయ్ కేశవరావు, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వరుణయాగ పూజలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం



పాల్గొన్న తప్పెట రామిరెడ్డి దంపతులు తదితరులు

హొళగుంద: రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన దేవరగట్టు శ్రీమాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో గత నెల 30వ తేదీ నుంచి జరుగుతున్న వరుణయాగ పూజలు ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. ఎల్లెల్సీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి, సతీమణి శోభా రామిరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బెల్గోణ రామశాస్త్రి చేతుల మీదుగా వరుణయాగ పూజలు జరిగాయి. ఆదివారం ముగింపు పూజలకు టీబీ బోర్డు ఉన్నతాధికారులు, ఎల్లెల్సీ ఎస్‌డీఓలు, ఆంధ్రా, కర్ణాటక సెక్షన్ ఆఫీసర్లు, రైతు సంఘం నాయకులు, దేవరగట్టు ఆలయ కమిటీ సభ్యులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా పూర్ణాహుతితో పాటు గంగిపూజ, ఇతర ప్రత్యేక పూజలు జరిగాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు ఆనందంగా ఉండాలని వరుణయాగ పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి తెలిపారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాల పంపిణీ చేపట్టారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో పత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



నందవరంలో మాల పంపయ్యకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజేశ్వరి



పెరాలసిస్‌కు చికిత్స పొందుతున్న కమాల్‌సాహెబ్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఫాతిమాబీ

నందవరం: ప్రతి నెల 1వ తేదీ వచ్చిందంటే పింఛన్‌దారులకు పింఛన్ల పండుగే. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పింఛన్‌దారులకు అందిస్తున్నారు. రెండవ రోజు ఆదివారం 94.87 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. మండలంలో 6,490 మంది పింఛన్లు గానూ 6,584 మంది ఫించన్ దారులకు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారని, మిగిలిన వారి సోమవారం పంపిణీ చేస్తామని ఎంపీడీఓ వెల్లడించారు.

కృష్ణగిరి: జూలై నెలకు సంబంధించి రెండవ రోజు ఆదివారం సాయంత్రం 7 గంటలకల్లా 93.89 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. ఇంటివద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయంతో అర్హులందరికీ అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.



జైనాబీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాదర్

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ

మద్దికెర: పెరవలి గ్రామానికి చెందిన జైనాబీ అనే వృద్ధురాలు ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లో ఉండే కుమారుడి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఖాదర్ ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చారు. పొరుగు రాష్ట్రంలో ఉంటున్న తన వద్దకు వచ్చి పింఛను సొమ్ము అందించడంపై లబ్ధిదారురాలు హర్షం వ్యక్తం చేశారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుచేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచ్‌పై కేసు నమోదు

వెల్దుర్తి: గోవర్ధనగిరి గ్రామ సర్పంచ్ ఎల్లరాముడుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శనివారం నాటి జగనన్న సురక్ష కార్యక్రమం సందర్భంగా గ్రామ సచివాలయంలోకి ప్రవేశించిన సర్పంచ్ విద్యుత్ లైన్‌మన్ తిరుమలరాయుడుపై భౌతికంగా దాడిచేసిన విషయం తెలిసిందే. ఘటనపై లైన్‌మన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి సర్పంచ్‌పై కేసు నమోదు చేశారు. పోలీసులు సర్పంచ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు, సోమవారం కోర్టులో హాజరుపరుచనున్నట్లు సమాచారం.

గ్రంథాలయానికి పుస్తకాల విరాళం



గ్రంథాలయానికి ఇచ్చిన పుస్తకాలను చూపుతున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన భీమన్న తన కుమార్తె అక్షయ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆదివారం స్థానిక గ్రంథాలయానికి పలు పుస్తకాలను విరాళంగా అందజేశారు. విద్యార్థులు, యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు గ్రూప్స్ పరీక్షలకు చెందిన విలువైన పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. పాఠకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

గోనెగండ్ల: ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ యూనియన్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం గోనెగండ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై 4, 5, 6 తేదీల్లో రాయలసీమ విద్య, వైజ్ఞానిక, రాజకీయ, సైద్ధాంతికతపై మంత్రాలయంలో శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. అలాగే విద్యా రంగంలో వస్తున్న సమూల మార్పులపై చర్చించేందుకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు విద్యావేత్తలు, మేధావులు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సోమప్ప స్వామికి పూజలు

ఆస్పరి: మండల కేంద్రంలో వెలసిన సోమప్ప స్వామి ఆలయంలో ఆదివారం మండల పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో గంగ, ఆకు పూజ, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



గుడేకల్ నుంచి గంధంను తీసుకొస్తున్న ఆస్థాన పీఠాధిపతులు



శరీరానికి కడ్డీలు గుచ్చుకొని గంధం ఊరేగింపులో పాల్గొన్న భక్తుడు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీ బాబా ఫరీద్ దర్గా 14వ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గంధోత్సవ ఉరేగింపు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గుడేకల్ గ్రామంలోని ఫకీర్ సర్దార్ చౌక్ బాబా ఫరీద్ దర్గా నుంచి గంధంకు ప్రార్థనలు చేసిన తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వహకులు నూర్‌బాబా, హుసేన్‌బాబా, సర్ఫ్‌రాజ్‌బాబా మాట్లాడుతూ.. గంధంను పురవీధుల గుండా ఉరేగింపుగా బాబాఫరీద్ సంస్థానానికి తీసుకెళ్తామని, రాత్రి ఖవ్వాలి ఉంటుందని చెప్పారు. సోమవారం ఉరుసు మహోత్సవం ఉంటుందని చెప్పారు. ఆంధ్రపదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రతో పాటు ఇతర దేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరవుతాయని తెలిపారు. రెండు రోజుల పాటు రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అనాథ శవాన్ని ఇంటికి చేర్చిన ఆధార్‌కార్డు

డోన్ టౌన్: ఆధార్ కార్డు.. ఓ అనాథ శవాన్ని అయినోళ్ల దగ్గరికి చేర్చి కుటుంబీకుల చేతుల మీదుగా దహన సంస్కారాలు అయ్యేందుకు దారి చూపింది. కుటుంబ సమస్యలతో పదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి ఒంటరిగా జీవించిన ఓ వ్యక్తి చివరకు అనాథగా మృతి చెందాడు. అనాథ శవానికి అంత్యక్రియలు పూర్తి చేసేందుకు స్థానికులు సిద్ధమయ్యారు. ఇంతలో ప్యాంట్ జేబులో చిరిగి పోయిన ఆధార్ కార్డును గుర్తించి కుటుంబీకుల చెంతకు చేర్చారు. ఈ సంఘటన డోన్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి మూర్ఛవ్యాధితో అస్వస్థతకు గురి కాగా గమనించిన ద్రోణాచలం సేవా సమితి సభ్యుడు, డ్రైవర్ రహంతుల్లా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. కోలుకోలేక ఆ వ్యక్తి ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఆసుపత్రి సిబ్బంది ద్రోణాచలం సేవా సమితి సభ్యులకు సమాచారం అందించడంతో సభ్యులు షాదిఖానా రాజు, గురుస్వామి, పానీపూరి మురళి, కరుణాకర్, రఫీ, కరిముల్లా, హోమేశ్వరరెడ్డి, మస్తాన్ అక్కడికి చేరుకున్నారు. హిందూ సంప్రదాయం మేరకు అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధమై మృతదేహానికి స్నానం చేయిస్తుండగా ప్యాంట్ జేబులో చిరిగిన ఆధార్ కార్డు కనిపించింది. అందులోని చిరునామా ఆధారంగా మృతుడు వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన నాయకంటి ఆగస్టీగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఆగస్టి భార్య కొన్నాళ్ల క్రితం చనిపోగా.. అతని కుమారుడు ఉపాధి నిమిత్తం బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురంలో ఉండటంతో బంధువుల ద్వారా విషయం తెలుసుకుని డోన్‌కు చేరుకున్నాడు. పదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన తమ తండ్రి చివరి చూపు దక్కేలా చేసిన ద్రోణాచలం సేవా సమితి సభ్యులకు మృతుడి కుమారుడు కృతజ్ఞతలు తెలిపారు.

పంటల బీమా మంజూరు

గోనెగండ్ల: దిగుబడి ఆధారిత, వాతావరణ ఆధారిత పంటల బీమా కింద మండలంలో 5,299 మంది రైతులకు రూ.5.5 కోట్ల పరిహారం మంజూరైందని మండల వ్యవసాయ అధికారిణి హేమలత ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2022 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసి పంటలు నష్టపోయిన రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద నష్ట పరిహారం మంజూరైందని తెలిపారు. ఈ నెల 8వ తేదీన రైతుల ఖాతాల్లో పంటల బీమా పరిహారాన్ని ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. లబ్ధిదారుల జాబితాను ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించామని సూచించారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్ తదితర సమస్యలుంటే సోమవారం సాయంత్రంలోపు తెలియజేయాలని కోరారు.

విద్యుత్ వాడకంపై అప్రమత్తం

కృష్ణగిరి: గృహాల్లో, వ్యవసాయ రంగంలో విద్యుత్ వాడకం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి సూచించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో ఏటా వ్యవసాయ కనెక్షన్లు పెరుగుతున్నాయని, రైతులు వ్యవసాయ విద్యుత్ వాడకం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వర్షాకాలం పంపుసెట్ల వద్ద ఏదైనా సమస్య ఏర్పడితే తక్షణమే సంబంధిత అధికారులకు తెలియజేసి సరిచేసుకోవాలని సూచించారు. అధికారులు అందుబాటులో లేకపోతే విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎల్సీ తీసుకున్నట్లు ఆధారాలు ఉంటేనే పని చేసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలను రైతులు నిర్లక్ష్యం చేయకుండా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.